క్లుప్తంగా

రేపు పాలకోడేరు మండల పరిషత్ సమావేశం

పాలకోడేరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశము ఎంపీపీ భూపతిరాజు సత్యనారాయణరాజు (చంటిరాజు) అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో టి. అనుహ్య సోమవారం తెలిపారు. ఈ సమావేశంలో ప్రజలకు కల్పించాల్సిన మౌలిక సౌకర్యాలు తాగునీరు తదితర వాటిపై చర్చించడం జరుగుతుందన్నారు. అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొనాలని ఆమె కోరారు.

గొల్లలకోడేరులో 14 మంది వలంటీర్ల రాజీనామా



గొల్లలకోడేరులో రాజీనామా చేసిన వలంటీర్లు

పాలకోడేరు: గొల్లలకోడేరు గ్రామంలోని 14 మంది వలంటీర్లు మూకుమ్మడిగా రాజీనామాలు చేశారు. ఈ మేరకు వారంతా కలిసి పంచాయతీ కార్యదర్శి లక్ష్మికి రాజీనామా లేఖలు సమర్పించారు. తాము నిష్పక్షపాతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందిస్తుంటే ప్రతిపక్షాలు తమపై చేస్తున్న అసత్య ఆరోపణలను తట్టుకోలేక రాజీనామా చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రంజాన్ తోఫా పంపిణీ



భీమవరంలో పేదలకు రంజాన్ తోఫా పంపిణీ చేస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశం చౌక్): పట్టణంలోని 61 ముస్లిం పేద కుటుంబాలకు ఎంఎం అలీ ఫౌండేషన్, మహబూబున్నీసా మధరసా ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ముస్లిం కమిటీ హాల్ నందు రంజాన్ తోఫా (నిత్యవసర సరుకులు) పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కరిమూల భాషా మాట్లాడుతూ రంజాన్ సందర్భంగా పేద వారికి ఎం. ఎం.అలీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రంజాన్ తోఫా అందజేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎండీ రహమత్ పాషా, ఎండీ తాజ్ పాషా, ఎండీ జాఫర్ పాషా, ఎండీ కిషోర్ పాషా, ఎస్.కె అబ్దుల్ ఖాదర్, ఎండీ గౌస్ మొహిద్దిన్, ఖాదర్ నిషా బేగం, ఎండీ రెహమాన్ , ఎస్‌కే నిషార్, ఎస్‌కే తోసిఫ్, ఎండీ ఖాదర్, ఎండీ సన్నీ, ఎండీ నూర్జహాన్, ఎండీ మున్నా తదితరులు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మకు వార్షికోత్సవ పూజలు

పెనుమంట్ర: జుత్తిగ గ్రామంలోని కనకదుర్గమ్మవారి 44వ వార్షికోత్సవ కార్యక్రమాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఉదయం అమ్మవారికి శాంతి పూజలు నిర్వహించిన అనంతరం చండీహోమం నిర్వహించారు. 9వ తేదీన ఉగాదిని పురస్కరించుకుని అమ్మవారికి కుంకుమార్చనలు, 10న ఆలయ ఆవరణలో అఖండ అన్నసమారాధన నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

వెలగలవారిపాలెంలో ధనలక్ష్మి అమ్మవారి 14వ వార్షికోత్సవం

వెలగలవారిపాలెంలో పైడవ చెరువుగట్టుపై వేంచేసియున్న ధనలక్ష్మి అమ్మవారి 14వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం గణపతి పూజ, నవగ్రహ పూజ, కలశారాధన అనంతరం అమ్మవారికి కుంకుమార్చనలు, చండీ హోమం నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నసమారాధన నిర్వహించారు. పిట్ల వేమవరానికి చెందిన మండ సత్యనారాయణరెడ్డి చందన దంపతుల ఆధ్వర్యంలో హోమం, పూజలు నిర్వహించారు.

లక్ష్యాలు పూర్తి చేయని సిబ్బందిపై చర్యలు

పాలకొల్లు అర్బన్: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వారీగా ఇచ్చిన లక్ష్యాలను సక్రమంగా పూర్తి చేయని ఆరోగ్య సిబ్బంది చర్యలు తప్పవని జిల్లా వైద్యాధికారి డా.డి మహేశ్వరరావు హెచ్చరించారు. పాలకొల్లు మండలం దగ్గులూరు సచివాలయం వద్ద సోమవారం నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్ ప్రత్యేక శిబిరాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఏఎన్ఎం, ఆశ వర్కర్లు సక్రమంగా విధులు నిర్వహించాలని సూచించారు. మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ అడ్డాల ప్రతాప్‌కుమార్, డాక్టర్ నవ్య జీవన్, 104 డివిజనల్ కోఆర్డినేటర్ ఎంవీవీఎస్ఎన్ మూర్తి, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, పీహెచ్ఎన్ పి ఎలిజబెత్ పాల్గొన్నారు.

గ్రామాల్లో పోలీస్ కవాతు

యలమంచిలి: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో గ్రామాలలో శాంతి భద్రతలకు విఘాతం రాకుండా, ప్రజల్లో నైతిక స్థైర్యం నింపడానికి పారా మిలటరీ బలగాలతో సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో పోలీస్ కవాతు నిర్వహించారు. ఎస్సై కాకి శివనారాయణ ఆధ్వర్యంలో సుమారు 200 మంది ఈ కవాతులో పాల్గొన్నారు. బాడవ, ఏనుగువానిలంక, కలగంపూడిలో ఈ కవాతు నిర్వహించారు.

సంక్షేమ పాలనకే ప్రజల మద్దతు

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్
- వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక



పార్టీలో చేరిన వారిని ఆహ్వానిస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్



తుందుర్రులో సమావేశంలో మాట్లాడుతున్న గ్రంధి శ్రీనివాస్

భీమవరం: రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమానికి జగనన్న ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. వీరవాసరం మండలం తోలేరు గ్రామ పంచాయతీ పరిధిలోని పడమటి పాలెం నుంచి సుమారు 50 మంది తెదేపా, జనసేన నాయకులు కార్యకర్తలు సోమవారం రాత్రి స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజమైన ప్రజా సేవ చేయాలనుకుంటే కచ్చితంగా తమ వైఎస్సార్ సీపీ పార్టీ వేదికగా చేసుకుని ప్రజలకు మేలు చేసే విధంగా పనిచేయాలని కార్యకర్తలకు ఆయన పిలుపునిచ్చారు. కుల మత రాజకీయాలకు అతీతంగా ఒకపక్క సంక్షేమాన్ని, మరోపక్క అభివృద్ధిని అమలు చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పట్ల ఇతర పార్టీల నాయకులు కార్యకర్తలు ఎందుకు రాజకీయంగా చూస్తున్నారని ఆయన ప్రశ్నించారు. మన రాష్ట్రాన్ని, మన నియోజకవర్గాన్ని మన ప్రాంతాన్ని మన గ్రామాన్ని ఏ ప్రభుత్వమైతే అభివృద్ధి చేసిందో, సంక్షేమ పథకాలు అమలు చేసిందో ఆ ప్రభుత్వానికి ప్రజల మద్దతు ఎప్పుడూ ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. 2019 ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని కూడా ఆయన అమలు చేశారని వెల్లడించారు. 2014లో చంద్రబాబు 600కు పైగా హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క హామీని కూడా అమలు చేయలేదని గుర్తు చేశారు. కాని మన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత కరోనా లాంటి భయంకరమైన వైరస్ కారణంగా రాష్ట్రంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నప్పుడు కూడా సంక్షేమ పథకాలను అమలు చేసి ప్రజలను ఆదుకున్నారని గుర్తు చేశారు. రాష్ట్రంలో మరోసారి సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే కచ్చితంగా ముఖ్యమంత్రిగా జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి తీసుకురావాలన్నారు. రాష్ట్రస్థాయిలోనే భీమవరం నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతున్న తనకు ఈసారి కూడా ప్రజల అండదండలు మరింతగా ఉండాలని ఆయన కోరారు. పార్టీలో చేరిన వారిలో శీలం సతీష్, శీలం రమేష్, వేంద్ర సూర్య, శీలం శ్రీను, శీలం గణేష్, పీతాని రాము, పితాని వెంకటేష్, విజయ్ కుమార్, సత్యనారాయణ, కడలి రామకృష్ణ, పితాని ఉమామహేశ్వర్, కడలి జోగయ్య, బొక్కా ధనుంజయ, వేంద్ర విజయకుమార్, దొంగ సత్యనారాయణ, శేఖర్, నాగరాజు ,సత్యనారాయణ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు చవ్వాకుల సత్యనారాయణ, కోడి శ్రీను, మండపాక రాంబాబు, తంగెళ్ళ బాబు, వేంద్ర కనకయ్య, వేంద్ర సూరిబాబు, శీలం వీర రాఘవులు, ఇంటి కాంతారావులు ఉన్నారు.

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు

భీమవరం అర్బన్: పిల్లలకు మనమిచ్చే ఆస్తి చదువేనని అందుకే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చి అధిక నిధులు కేటాయించి విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేశారని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. భీమవరం మండలంలోని తుందుర్రు, పెదగరువు, జొన్నలగరువు గ్రామాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. నవరత్నాలలో ఒకటైన అమ్మ ఒడి, జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన, జగనన్న విద్యా కానుక, ఫీజు రీయంబర్స్‌మెంట్, జగనన్న విదేశీ విద్య లాంటి అనేక సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసి విద్యార్థుల ఉన్నత భవిష్యత్తు కోసం పనిచేశారన్నారు. అంతేకాకుండా నాడు-నేడు పథకంలో భాగంగా ప్రతి ప్రభుత్వ పాఠశాలను కార్పొరేట్ స్థాయికి మించి అన్ని మౌలిక వసతులతో అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. ఇంగ్లీషు మాధ్యమంలో విద్య బోధన, రూ. 30 వేలువ చేసే బైజూస్ కంటెంట్ కలిగి ట్యాబ్‌లు అందజేయడంతో సర్కారు పాఠశాల విద్యార్థులు ప్రపంచ దేశాలతో పోటీపడుతున్నారన్నారు. చంద్రబాబు పేదలు కాని, వారి పిల్లలు కాని బాగుంటే ఓర్చలేరన్నారు. విద్యార్థులు ఉన్నతంగా స్థిరపడితే ఆ ప్రభావం రాష్ట్రాభివృద్ధిపై పడుతుందని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వేల కోట్లు విద్యార్థుల భవిష్యత్తుపై పెట్టుబడి పెట్టారన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు కావాలంటే మరోసారి సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి గెలుపించుకోవాలన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో గ్రామాల మధ్య హాని చేసే గోదావరి మెగా ఆక్వా ఫుడ్ పార్కు నిర్మిస్తుంటే సుమారు 40 గ్రామాల ప్రజలు వ్యతిరేకిస్తుంటే ప్రజలకు అండగా తామే అండగా ఉన్నామని ఈ విషయాన్ని గ్రామ ప్రజలు మరిచిపోకూడదన్నారు. తాము ఎప్పుడూ ప్రజల పక్షాన ఉన్నామని గుర్తుచేశారు. రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి, నరసాపురం పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాలకు, నియోజకవర్గంలో తనకు అండగా ఉండి అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు, జెడ్పీటీసీ కాండ్రేగుల నరసింహారావు, మండల పార్టీ అధ్యక్షుడు తిరుమాని ఏడుకొండలు, సర్పంచ్‌లు ఆరేటి వెంకట సత్య వీరాస్వామినాయుడు (పెద్దబ్బు), సోడదాసి లలిత కుమారి, రావూరి లాజరు, జడ్డు తాతాలు, జవ్వాది సత్యనారాయణ, కొట్టు త్రినాథ్ (నెం.2), కోయ నగేష్‌బాబు, కొట్టు కుటుంబరావు పేరిచర్ల అప్పలరాజు, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రెండు ఓట్లూ ఫ్యాన్ గుర్తుకే వేయండి



చెరుకువాడలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్ నర్సింహరాజు



ఆకివీడు 12వ వార్డుల్లో ఆటో డ్రైవర్లను ఓట్లు అభ్యర్థిస్తున్న పీవీఎల్ సోదరుడు పెన్మెత్స గోపాలకృష్ణంరాజు



ఆకివీడు 10వ వార్డులో నిర్వహిస్తున్న ఎన్నికల ప్రచారం

- పీవీఎల్ సోదరుడు పెన్మెత్స గోపాలకృష్ణంరాజు
- ఆకివీడులో 10, 12 వార్డుల్లో ఎన్నికల ప్రచారం

ఆకివీడు: సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే, ఎంపీ స్థానాలను అన్నింటిని కైవసం చేసుకుని వైఎస్సార్‌సీపీ డబుల్ సెంచరీ సాధించడం ఖాయమని భీమవరం అసెంబ్లీ పరిశీలకులు మోటుపల్లి గంగాధరరావు, పీవీఎల్ సోదరుడు పెన్మెత్స గోపాలకృష్ణంరాజు ధీమా వ్యక్తం చేశారు. స్థానిక నగర పంచాయతీలోని 12వ వార్డు కౌన్సిలర్ కట్టా రవీంద్రనాథ్ ఠాగూర్, 10వ వార్డు ఇన్‌చార్జి జోగి నాగరాజు ఆధ్వర్యంలో ఆయా వార్డుల్లో సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లోని పెద్దల్ని కలిసి ఓట్లు అభ్యర్థించారు. పలు వ్యాపార సంస్థలు, పెట్రోల్ బంకులు, కాఫీ హోటళ్లు, కూరగాయల దుకాణాలు, బడ్డీ కొట్ల వద్ద వెళ్లి రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకు వేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఆటోవాలాలను, బస్సులు, ఆటోల్లో ప్రయాణికుల్ని ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేయాలని అభ్యర్థించారు. ప్రచార కార్యక్రమంలో రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ మేకా పార్వతి, నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి, త్రిసభ్య కమిటీ చైర్మన్ కేశిరెడ్డి మురళీ, మెప్మా అధ్యక్షురాలు మోరా జ్యోతి, నగర పంచాయతీ వైస్‌చైర్మన్ పుప్పాల పండు, వంగా జ్యోత్స్న, ఎస్కే.హుస్సేన్, వల్లీ, సాయి, ఊడిగ శ్రీనివాస్, ఎండీ.మాబూ, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి కురెళ్ళ పౌలు, వనువులమ్మ దేవస్థానం చైర్మన్ పొన్నాల నాగమణి, తిప్పా దుర్గాభవాని, మన్నే లలితాదేవి, గుండుగొలను సావిత్రి, రాజులపూడి వెంకటేశ్వరరావు, గాలి దేవర శ్రీనివాస్, నర్సింహమూర్తి, పాల్గొన్నారు.

దళితుల సమస్యలపై హామీలను మేనిఫెస్టోలో చేర్చాలి



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు రాజగోపాల్

భీమవరం: ఎన్నికల సందర్భంగా అన్ని రాజకీయ పార్టీలు దళితుల సమస్యలపై నిర్దిష్టమైన హామీలను మేనిఫెస్టోలో చేర్చాలని కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే దిగుపాటి రాజగోపాల్ కోరారు. సోమవారం భీమవరంలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోసపూరిత హామీలతో దళితులను మోసం చేస్తున్నాయన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసి రిజర్వేషన్లను రద్దు చేయాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బహుజన ఏపి జేఏసి రాష్ట్ర అధ్యక్షుడు కోనా జోసెఫ్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల హక్కులను కాలరాస్తున్నారన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి బి బలరామ్ మాట్లాడుతూ దేశంలో అత్యధికులుగా, శ్రామికులుగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీల స్థానం అట్టడుగున ఉండడం బాధాకరమన్నారు. జాతీయ బీసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కోడే యుగంధర్, దళిత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందర్‌కుమార్ మాట్లాడుతూ దళిత, బీసీల ఐక్యతతో హక్కులను కాపాడుకోవాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి మల్లిపూడి ఆంజనేయులు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతి బాబు, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు బత్తుల విజయ్‌కుమార్, బిరుదుగడ్డ రమేష్, గాతల జేమ్స్, ఎం వైకుంఠరావు, జి మేరీఅలిశా, వి సత్యవాణి, కానేటి బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల అధికారులకు ఈవీఎంలపై శిక్షణ



ఈవీఎంల శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ప్రవీణ్ ఆదిత్య

భీమవరం: ఎన్నికలకు సంబంధించి ఈవీఎంల ర్యాండమైజేషన్ శిక్షణా తరగతులను సోమవారం భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో జిల్లా జాయింట్ కలెక్టర్ సివి ప్రవీణ్ ఆదిత్య నిర్వహించారు. ఉండి అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన అసిస్టెంట్ రిటర్నింగ్, సెక్టార్ అధికారులు, ఎంపీడీఓలతో జాయింట్ కలెక్టర్, ఉండి అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రవీణ్ ఆదిత్య , పోలింగ్ రోజున పోలింగ్ అధికారులకు బ్యాలెట్ యూనిట్ (బియు), సెంట్రల్ యూనిట్ (సియు), వి వి పాడ్స్‌ను ఏ విధంగా పంపిణీ చేయాలి, బ్యాలెట్ యూనిట్‌లో బ్యాలెట్ పేపర్స్‌ను ఎలా సీల్ చేయాలో తెలిపారు. బ్యాలెట్ యూనిట్‌కు సెంట్రల్ యూనిట్‌కు వీవీపాడ్స్‌ను ఎలా కనెక్ట్ చేయాలో వివరించారు. మే 2, 3 తేదీల్లో ఈవీఎం కమీషనింగ్ ఉంటుందని దానికోసమే ముందస్తు శిక్షణ తరగతులను ప్రారంభించినట్లు ప్రవీణ్ ఆదిత్య చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉండి అసెంబ్లీ నియోజకవర్గ అసిస్టెంట్స్, రిటర్నింగ్, సెక్టార్ అధికారులు పాల్గొన్నారు.

నేటినుంచి ముఖ ధారమ్మ జాతర ప్రారంభం



అమ్మవారి ఆలయం వద్ద విద్యుద్దీపాలంకరణ

పాలకొల్లు సెంట్రల్: స్థానిక అచ్చుగట్లపాలెం చిత్రావి చెరువు గట్టున కొలువై ఉన్న ముఖధారమ్మ తల్లి జాతర మహోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభకానున్నాయి. ఏటా ఉగాది పర్వదినం రోజున అమ్మవారి ఉత్సవాలు ప్రారంభమవుతాయని కమిటీ అధ్యక్షుడు కుంపట్ల చిన్నరాజా తెలిపారు. ఈ నెల 9 నుంచి 15వ తేదీ వరకూ వారం రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ వారం రోజులు అమ్మవారు బంగారు కిరీటం, వెండి చీర అలంకరణలో దర్శనమివ్వనున్నారు. మంగళవారం అమ్మవారి పుట్టింటివారైన శ్రీ పిన్ని ఉప్పరి కుటుంబ సభ్యులతో ఊరేగింపు, బుధవారం ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో గ్రామోత్సవం, సాంస్కృతిక ప్రదర్శనలు, గురువారం కాకుల కుటుంబ సభ్యులతో అమ్మవారి ఊరేగింపు నిర్వహించనున్నారు. అమ్మవారికి కుంకుమ పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఆలయ కమిటీ సభ్యులు చెక్కా కృష్ణ, చినిమిల్లి బాబి ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

గంగమ్మ తల్లి మండప ప్రతిష్ట మహోత్సవం

పెనుగొండ: సిద్ధాంతం వశిష్ట గోదావరి తీరం కేదారీ ఘాట్ వద్ద గంగమ్మ తల్లి ఆలయ మండప ప్రతిష్ఠ మహోత్సవం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉగాది వేడుకలను ప్రారంభించారు. సిద్ధాంతం అగ్నికుల క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు.

అక్రమ మద్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

జాయింట్ కలెక్టర్ ప్రవీణ్ ఆదిత్య ఆదేశం

ఉండి: సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అక్రమ మద్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా జాయింట్ కలెక్టర్, నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి సీవీ ప్రవీణ్ ఆదిత్య అధికారులను ఆదేశించారు. సోమవారం ఉండి ఎంపీడీవో కార్యాలయంలో అధికారులు, పోలీసులు, ఎక్సైజ్ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం అక్రమ రవాణా జరగకుండా ప్రతి మద్యం దుకాణాన్ని రోజూ క్షుణ్ణంగా పరిశీలించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దుకాణంలో స్టాకు, నగదు వివరాల్లో ఏవైనా వ్యత్యాసాలు ఉంటే వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి వ్యక్తికి 3 బాటిల్స్‌కు మించి అమ్మకం చేయకూడదనే నిబంధనను తప్పక పాటించేలా చూడాలని జేసీ సూచించారు. ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ బృందాలు క్షేత్రస్థాయిలో బాగా పనిచేసి మంచి ఫలితాలు సాధించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవోలు, సెక్టార్ అధికారులు, తహసీల్దార్లు, పోలీస్, ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను ముందస్తు చెల్లింపుపై 5 శాతం రాయితీ

భీమవరం (ప్రకాశం చౌక్): భీమవరం మునిసిపాలిటీలో 2024–25 సంవత్సరానికి ఆస్తి పన్నును ఒకేసారి చెల్లిస్తే ప్రభుత్వం 5 శాతం రాయితీ ఇస్తుందని కమిషనర్ ఎం.శ్యామల తెలిపారు. ఈనెల 30 లోపు మొత్తం పన్ను ఒకేసారి చెల్లించిన వారికి ఈ 5 శాతం పన్ను రాయితీ అమలవుతుందన్నారు. ఈమేరకు సోమవారం ప్రభుత్వ ఉత్తర్వులు వచ్చినట్లు తెలిపారు. పన్ను చెల్లింపులు పుర పాలక సంఘ కార్యాలయంలో గాని, సచివాలయం వద్ద గాని లేదా ఆన్‌లైన్‌లో ఛీఛీర్బ్చుు.ఃజి.జీ ు వెబ్సైట్ ద్వారా గాని చెల్లించవచ్చన్నారు. పన్ను చెల్లింపుదార్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవలసినదిగా కోరారు.

ఓటు హక్కుపై అవగాహన

భీమవరం (ప్రకాశంచౌక్): సోమవారం స్థానిక టిడ్కో గృహముల సముదాయంలో నివాసితులకు ఓటు హక్కు పై అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు స్వీప్ నోడల్ అధికారి జీసీహెచ్ ప్రభాకర్ అన్నారు. ఈ సందర్భంగా చునావ్ పాఠశాల నిర్వహించడం జరిగిందన్నారు. ఓటు యొక్క విలువ, ప్రజాస్వామ్యబద్ధంగా ఓటు ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా ఓటు వేయాలని సూచించారు. ఓటు వేసే విధానమును యంత్రాంగంపై అవగాహనను జిల్లా స్వీప్ నోడల్ అధికారి జి సి హెచ్ ప్రభాకర్ కల్పించారు. ఈ కార్యక్రమంలో బిఎల్‌వోటి కృష్ణమూర్తి, టి నాగేశ్వరరావు, సప్పా శ్రీనివాస్, దుక్కా చరణ్, వి డేవిడ్‌రాజు పాల్గొన్నారు.

స్థల వివాదంపై కేసు నమోదు

ఆకివీడు: స్థల వివాదంపై భీమవరం రూరల్ మండలం దెయ్యాలతిప్ప గ్రామానికి చెందిన తేజస్విని, ఆమె భర్త చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై బి.నాగబాబు చెప్పారు. స్థానిక పెదపల్లి వీధిలో వారసత్వంగా వచ్చిన తమ స్థలాల్ని అంకాని వెంకటలక్ష్మి, అంకాని భవానీ శంకర్ ఆక్రమించుకున్నారని, ఇదేంటని అడిగితే తమపై దౌర్జన్యం చేసి అసభ్యకరమైన మాటలతో దూషించారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

నేడు బండి ముత్యాలమ్మ ఆలయంలో పంచాంగ శ్రవణం

మొగల్తూరు: ఉగాది పండుగను పురస్కరించుకుని ముత్యాలపల్లిలోని బండి ముత్యాలమ్మ ఆలయ ప్రాంగణం మంగళవారం ఉదయం ప్రముఖ పండితుల ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణంతో పాటు చండీ హోమం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో డి.రామకృష్ణంరాజు సోమవారం తెలిపారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్, సభ్యుల సమక్షంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమాలకు భక్తులు తరలివచ్చి జయప్రదం చేయాలని ఆయన కోరారు.

డీఎన్నార్ కళాశాలలో అవగాహన సదస్సు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక దాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్, జేసీఐ సంయుక్త ఆధ్వర్యంలో గుండెపోటుపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. సోమవారం కళాశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్యామ్ వివేక్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థినులకు గుండె పోటు వచ్చినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా గుండె పోటు వచ్చిన వారికి సీపీఆర్ ఎలా చేయాలి ఏ సమయంలో చేయాలి అనే విషయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ శోభారాణి, మణిమాల, పీఓ విజయలక్ష్మి, శ్రీసంధ్య పాల్గొన్నారు.